అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

కాప్రాలో జోనల్ కమిషనర్ పర్యటన


కాప్రాలో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్

కాప్రా: డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తామని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. బుధవారం ఆయన కాప్రా డివిజన్‌లో పర్యటించారు. బాబానగర్, గోపాల్‌రెడ్డినగర్, ఎల్లారెడ్డిగూడ, కందిగూడ, యాదవబస్తీ, మల్లికార్జున్ నగర్, రాజీవ్ ఎన్‌క్లేవ్, శ్రీయుగ ఎన్‌క్లేవ్‌లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాప్రా డివిజన్‌లో పలు కాలనీల్లో సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్స్, పార్కుల సుందరీకరణకు నిధులు మంజూరు చేయాలని స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్ విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన జడ్సీ హేమంత్ కేశవ్ అభివృద్ధి పనుల కోసం నిధుల మంజూరుకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేందర్, డిప్యూటీ ఇంజనీర్ బాలకృష్ణ, ఏఈ సూరజ్, ప్రశాంత్, శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్ పాల్గొన్నారు.

సామాజిక అధ్యయన కేంద్రం కరపత్రం ఆవిష్కరణ


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కాప్రా: కేఎల్ మహేంద్ర సోషల్ స్టడీ సర్కిల్ సామాజిక అధ్యయన కేంద్రం ప్రారంభోత్సవ కరపత్రాన్ని బుధవారం నిర్వాహణ కమిటీ సభ్యులు, సీపీఐ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఈసీఐఎల్‌లోని సీపీఐ కార్యాలయంలో నీలం సంజీవరెడ్డి భవన్‌లో ఈ నెల 22న స్టడీ సర్కిల్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కేఎల్ మహేంద్ర క్రియాశీలక పాత్ర పోషించారని, అనేక కార్మిక ఉద్యమాలకు నాయకత్వం వహించి హక్కుల సాధనకు పోరాడారన్నారు. సింగరేణి వర్కర్స్ యూనియన్ నుంచి అంతర్జాతీయ కార్మిక నాయకుడిగా ఎదిగారని గుర్తు చేశారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న మార్పులపై అధ్యయనం చేసి, పరిశోధనాత్మకమైన వ్యాసాలు రాసేందుకు మహేంద్ర పేరుతో స్టడీ సర్కిల్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ అధ్యయన కేంద్రంలో ఉద్యమకారులు, రచయితలు రాసిన పుస్తకాలతో పాటు పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న పేద విద్యార్థుల కోసం పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి దామోదర్‌రెడ్డి, సభ్యులు శంకర్‌రావు, నర్సింహ, లక్ష్మీనారాయణ, ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలకు నిలయం రామ్‌రాజ్ కాటన్


రామ్‌రాజ్ కాటన్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న దిల్‌రాజు, కేఆర్.నాగరాజన్


మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

సినీ నిర్మాత దిల్ రాజు

గౌతంనగర్: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు రామ్‌రాజ్ కాటన్ ప్రత్యేక నిలయంగా మారుతుందని సినీ నిర్మాత దిల్ రాజు అన్నారు. బుధవారం ఆయన గౌతంనగర్ డివిజన్, భవానీనగర్‌లో ఏర్పాటు చేసిన రామ్‌రాజ్ కాటన్ షోరూమ్‌ను మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, రత్నాలయం దేవస్థానం వైస్ చైర్మన్ రామవెంకటేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ.. భారతదేశ అత్యంత విశ్వసనీయ, ఆకర్షణీయ బ్రాండ్ జాబితాలో రామ్‌రాజ్‌కు స్థానం దక్కిందన్నారు. అమ్మకాల్లోనూ రామ్‌రాజ్ కాటన్ ప్రత్యేక స్థానాన్ని సంపాదించిందన్నారు. అనంతరం రామ్‌రాజ్ కాటన్ వ్యవస్థాపకులు, చైర్మన్ కేఆర్.నాగరాజన్ మాట్లాడుతూ.. మల్కాజిగిరిలో 300వ షోరూమ్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. సంప్రదాయం, సంస్కృతిని కాపాడాలనే తపనతో ఈ సంస్థను ప్రారంభించామన్నారు. బాక్టీరియల్, వైరల్ ఇన్ఫెక్షన్ల నుంచి రక్షించడానికి రామ్‌రాజ్ కొత్తగా యాంటీ బాక్టీరియల్ ధోతీలను ప్రారంభించిందని, యువతను ఆకట్టుకునే వివిధ రంగుల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. అదేవిధంగా www.ramraj-cotton.in లో ఆన్‌లైన్ విక్రయాలను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, షోరూమ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయండి


హైడ్రా కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న డిప్యూటీ మేయర్

బోడుప్పల్: చెంగిచర్లలోని సర్వే నంబరు 59లో నిర్మిస్తున్న బహుళ అంతస్తుల నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ బోడుప్పల్ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్ బుధవారం హైడ్రా కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం బోడుప్పల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సర్వేనంబర్ 59లో గతంలో లే అవుట్ చేసి ప్లాట్లు విక్రయించారన్నారు. ఓ మాజీ ప్రజాప్రతినిధి హెచ్ఎండీఏ, బోడుప్పల్ నగర పాలక సంస్థ అధికారులను తప్పుదారి పట్టించి చెరువు శిఖం భూమిలో గృహ నిర్మాణాలకు అనుమతులు తీసుకుని అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారన్నారు. 59 సర్వేనంబర్‌లోని 4.12 ఎకరాలకు, సర్వేనంబరు 57 చింతల చెరువు శిఖం భూమిలో సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు కొత్త ప్రభాకర్‌గౌడ్, కుర్రి శివశంకర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి


ఎంపీ ఈటలకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

మౌలాలి : అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వినాయక్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి అన్నారు. ఈ మేరకు బుధవారం మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ను కలిసి సీసీ కెమెరాల ఏర్పాటు, వైకుంఠధామం తదితర పనులకు నిధులు మంజూరు చేయించాలని కోరారు. వాజ్‌పాయ్‌నగర్‌లో రైల్వే గేట్ వద్ద వంతెన నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించినందున త్వరలో పని మొదలు పెట్టాలని కోరారు. రైల్వే గేట్ కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, విద్యుత్ అధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన ఈటల రాజేందర్ నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

పేదల సంక్షేమమే ధ్యేయం



మౌలాలి : నియోజకవర్గ పరిధిలో పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన డివిజన్ పరిధిలోని పీబీ సూర్యనగర్, రాక్ హిల్స్ కాలనీ, హరిజన బస్తీ, షఫీనగర్, సాదుల్లానగర్, సుభాష్‌నగర్ బస్తీల్లో పర్యటించారు. వక్ఫ్‌బోర్డు రిజిస్ట్రేషన్ల నిలిపివేత కోరుతూ చేసిన ప్రకటనతో భయాందోళనకు గురైన ప్రజలకు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. దాదాపు 30 ఏళ్ల క్రితం ఏర్పాటైన కాలనీలు, బస్తీల నుంచి అన్ని రకాల పన్నులు వసూలు చేస్తున్న ప్రభుత్వాలు రిజిస్ట్రేషన్లు నిలిపివేస్తామనడం దారుణమన్నారు. కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, నాయకులు వంశీ ముదిరాజ్, అమీనుద్దీన్, భాగ్యనంద్‌రావు, ఉస్మాన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో గృహోపకరణాలు దగ్ధం

మల్లాపూర్: ఓ ఇంట్లో అగ్నిప్రమాదం కారణంగా గృహోపకరణాలు దగ్ధమైన సంఘటన బుధవారం నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నర్సింహానగర్ కాలనీలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సాయి గార్డెన్ సమీపంలోని ఓ ఇంట్లో మౌనిక అనే మహిళ వేడినీళ్లను బెడ్‌పై పెట్టి బయటికి వెళ్లింది. దీంతో హీటర్ వేడికి బకెట్ కాలి గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు.

ప్రజావాణికి గ్రహణం

- కార్యక్రమ నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యం
- పరిష్కారానికి నోచుకోని సమస్యలు
- తూతూ మంత్రంగా అమలు


ప్రజావాణి కార్యక్రమంలో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి గ్రహణం పట్టింది. ప్రజా సమస్యలను తెలుసుకుని వెంటనే వాటిని పరిష్కరించాల్సిన అధికారులు తూతూ మంత్రంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పేరుకు మాత్రం ఒకరు ఇద్దరు అధికారులతో కార్యక్రమాన్ని నిర్వహించి మమ అనిపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ఉప్పల్ సర్కిల్‌లో అభాసు పాలవుతోందని ఫిర్యాదుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రే స్వయంగా పర్యవేక్షిస్తున్న ఈ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించడంలో అధికారులు మీన వేషాలు లెక్కిస్తున్నారు. ఈ నెలలో మూడు దఫాలుగా ప్రజావాణి నిర్వహించగా కేవలం 17 మాత్రమే ఫిర్యాదులు అందాయి. వాటిలో ఒక్క సమస్యను కూడా అధికారులు పరిష్కరించిన దాఖలాలు లేక పోగా 12 వరకు ఫిర్యాదులను పరిష్కరించినట్లు కాకి లెక్కలు చెబుతుండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకునేవారు లేక..

ప్రతి వారం నిర్వహించే ప్రజా వాణిని ప్రజల నుంచి స్పందన కూడా కరువవుతోంది. ప్రారంభంలో ప్రతి వారం దాదాపు 10 నుంచి 13 వరకు ఫిర్యాదులు అందేవి. అయితే వాటిలో ఒక్కటి కూడా పరిష్కారానికి నోచుకోకపోవడంతో ఫిర్యాదుల సంఖ్య తగ్గిపోయింది. ప్రస్తుతం ఒకటి రెండు ఫిర్యాదులు మాత్రమే అందుతుండటం గమనార్హం. అధికారుల గైర్హాజరు, కేవలం సిబ్బంది మాత్రమే సమస్యలను స్వీకరిస్తుండటంతో ప్రజలకు కార్యక్రమ నిర్వహణపై నమ్మకం పోయింది. దీంతో ప్రజావాణిలో వినిపించిన సమస్యలు అరణ్య రోదనగానే మిగలడంతో ఫిర్యాదులు చేసినా లాభం లేదనుకొని ఫిర్యాదుదారులు రావడమే మానేశారు.

- ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో గత సోమవారం నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో సూపరిటెండెంట్‌ను

కూర్చోబెట్టి మిగిలిన విభాగాల అధికారులు గైర్హాజరు కావడంపై ఫిర్యాదులదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల నుంచి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వచ్చే అవకాశం ఉన్నా ఆయా శాఖల అధికారులు కార్యక్రమానికి డుమ్మా కొట్టడం ఏమిటని, అధికారులు లేకపోతే తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని అసలు ఈ కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహిస్తున్నారో స్పష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజావాణి ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు నిర్వహించాలి. అందులో జీహెచ్ఎంసీ సర్కిల్‌కు సంబంధించిన వీధి లైట్లు, ఎంటమాలజీ, ఇంజినీరింగ్, ట్యాక్స్, టౌన్ ప్లానింగ్, శానిటరీ విభాగం తదితర అన్ని విభాగాల అధికారులు విధిగా హాజరు కావాలి. అయితే వారెవరూ లేకుండా ప్రజావాణిని తూతు మంత్రంగా నడిపించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ప్రజావాణిని సరైన పద్ధతిలో నడిపించాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



కాప్రా: విద్యుత్ మరమ్మతులు, విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా సైనిక్‌పురి సబ్ స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ సత్యనారాయణ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విజయపురి, ఆధ్యనగర్, రుక్మిణిపురి, సైనిక్‌పురి, త్యాగరాయనగర్, అయోధ్యనగర్, నయక్రాంతినగర్, ప్రశాంత్ నగర్, శివపురి కాలనీ, శంఖ్ కాలనీ, ఆదిత్య నగర్, సిద్ధార్థ కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రామంతాపూర్ : విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గణేష్‌నగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శారదానగర్, న్యూ గోకులేనగర్, ఓల్డ్ రామంతాపూర్ మెయిన్ రోడ్డు అపోజిట్ హెచ్‌పీఎస్సీ స్కూల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ లావణ్య తెలిపారు.

నేడు జిల్లా స్థాయి క్రీడా పోటీలు

అల్వాల్: ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వికలాంగుల సంక్షేమాధికారి ఆధ్వర్యంలో ఆర్‌కేపురంలోని అంబేద్కర్ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో గురువారం జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు స్పోర్ట్స్ ఆర్గనైజర్ ఉమ్మర్‌ఖాన్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన వివిధ ప్రత్యేక పాఠశాలలో చదివే విద్యార్థులు గురువారం ఉదయం ఉదయం పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలు – 8978713923లో సంప్రదించాలని సూచించారు.

సీసీ కెమెరాల ప్రారంభం


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్ఐ మైబెల్లి

మల్లాపూర్: నేర పరిశోధనలో నిఘా నేత్రాలు కీలకమని నాచారం ఎస్ఐ మైబెల్లి అన్నారు. బుధవారం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని సింగ చెరువు తండా అధ్యక్షుడు పీరునాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. నేరాలను అదుపు చేయడంలో సీసీ కెమెరాలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో కుంటి కృష్ణ, సింగచెరువు తండా వాసులు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనకు ఆహ్వానం


ఎమ్మెల్సీ యగ్గే మల్లేష్‌ను సత్కరిస్తున్న కురుమ సంఘం ప్రతినిధులు

ఉప్పల్: ఉప్పల్ కురుమ సంఘం ప్రతినిధులు బుధవారం ఎమ్మెల్సీ యగ్గే మల్లేష్‌ను కలిసి కురుమ విద్యార్థి హాస్టల్ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా కురుమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లేష్ ఆయనను సత్కరించారు. కురుమ విద్యార్థి హాస్టల్ నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు గొరిగే మల్లేష్, పెద్ద మల్లేష్, వెలుగుట్ల జన్నీ రఘు, చిందం వెంకటేష్, బర్ల కృష్ణ, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ రాజీవ్‌గాంధీనగర్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం కాలనీలో పర్యటించిన ఆయన సీసీరోడ్డు ,డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ స్థానికులు గత 40 ఏళ్లుగా రైల్వే స్థలానికి సంబంధించి సమస్యలు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అధైర్యపడాల్సిన అవసరం లేదని త్వరలోనే రైల్వే అధికారులు, కాలనీవాసులతో సమావేశం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాముయాదవ్, జ్ఞానేశ్వర్, కాలనీవాసులు ప్రదీప్, యాకూబ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

అదే కాలనీలో రూ.4 లక్షలతో చేపట్టిన యూజీడీ పనులను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా ప్రజల సమస్యలు పరిష్కారం కాలేదని, సుమారు 15 ఏళ్ల తర్వాత చొరవ తీసుకుని యూజీడీ నిర్మాణానికి చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో రాజేష్, అజయ్, నాని, రవి,చారి, మహేష్ పాల్గొన్నారు.

అమ్మవారిని ఆరాధిస్తే సకల శుభాలు

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్

రామంతాపూర్ : అమ్మవార్లను ఆరాధిస్తే సకల శుభాలు కలుగుతాయని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. బుధవారం ఆయన కామాక్షిపురంలోని శ్రీ నల్ల పోచమ్మ రేణుక ఎల్లమ్మ ఆలయ 21 వార్షికోత్సవం సందర్భంగా కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావుతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామ దేవతలైన అమ్మవార్లు శక్తి స్వరూపిణులని, అమ్మవార్లను ఆరాధిస్తే దుష్టశక్తులు దూరమై అన్ని శుభాలే జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన సలహాదారు చింతూరు శ్రీనివాస్ చారి, అధ్యక్షులు పూస సత్యనారాయణ చారి, ప్రధాన కార్యదర్శి రాములు, ఉపాధ్యక్షులు అశోక్ రాజా, నరసింహ, కోశాధికారి నరసింహ చారి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా ఆటోలు నడిపితే కఠిన చర్యలు


ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ రవికుమార్

మల్లాపూర్: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడిపితే కఠిన చర్యలు తప్పవని చర్లపల్లి ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ట్రాఫిక్ ఎస్ఐ సతీష్ అన్నారు. బుధవారం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్‌లో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నింబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ త్వరలో చర్లపల్లి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న తరుణంలో ఆటో డ్రైవర్లందరూ ఆటోలకు ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, ఆర్సీలు, లైసెన్సులు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శేఖర్, ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వేముల మారయ్య, కాప్రా డివిజన్ అధ్యక్షులు రామాంజనేయులు, గోపాల్ నాయక్, రమేష్, నరేష్, మహేష్, కృష్ణ, నర్సింగ్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

హిల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానెహ్రూనగర్ హిల్ చర్చిలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం యువ నాయకులు గ్యార ప్రవీణ్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ బక్క ఏలియా, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో చికిత్స పొందుతూ ఇద్దరు మహిళల మృతి


సోని మృతదేహం

మల్కాజిగిరి: చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ గణేష్‌బాబు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..రాజస్థాన్‌కు చెందిన సోని(50), ప్రకాష్ దంపతులు రెండు రోజుల క్రితం నగరానికి వలస వచ్చి మౌలాలి రైల్వే స్టేషన్ పక్కన పాత క్వార్టర్స్ వద్ద ఉంటున్నారు. ఈ నెల 17న భార్యాభర్తల మధ్య జరిగిన గొడవలో సోని గాయపడటంతో స్థానికులు ఆమెను గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. ఆస్పత్రిలో చేర్పించిన అనంతరం భర్త పారిపోయాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ..


ఉషారాణి (ఫైల్)

కుషాయిగూడ: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ మహిళ బుధవారం మృతి చెందింది. మల్లాపూర్, మర్రిగూడకు చెందిన ఉషారాణి ఈ నెల 19న రాత్రి ఈసీనగర్ గణేష్ కమాన్ వద్ద ఆటో కోసం ఎదురు చూస్తుండగా అదే సమయంలో బైక్‌పై వేగంగా దూసుకువచ్చిన సాయి చంద్రశేఖర్ ఆమెను ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఉషారాణి చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్

బోడుప్పల్: డివిజన్ పరిధిలో దశల వారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ తెలిపారు. బుధవారం 28వ డివిజన్ పరిధిలో రూ 20లక్షలతో చేపట్టిన కమ్యూనిటీ హాల్ భవనం, సుభాష్‌నగర్ కాలనీలో రూ. 20లక్షలతో సీసీ రోడ్డు పనులకు వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ముఖ్యంగా తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్ సమస్యలపై దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, 28వ డివిజన్ కార్పొరేటర్ చీరాల నర్సింహ్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు దానగల్ల యాదగిరి, రాపోలు ఉపేందర్ పాల్గొన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా నాగిళ్ల


నాగిళ్ల బాల్‌రెడ్డి, అధ్యక్షుడు


రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి

కుషాయిగూడ: కుషాయిగూడ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా నాగిళ్ల బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మొగిలి రాఘవరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం పూర్తిస్థాయి కమిటీని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా బిలకంటి వెంకట నరసింహారెడ్డి, బుచ్చన్నగారి శ్రీకాంత్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా సామ వెంకట్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రవిపల్లి రవీందర్‌రెడ్డి, కోశాధికారిగా రావుల రాంరెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాగిళ్ల మాట్లాడుతూ అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కుల పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సలహాలు, సూచనల మేరకు రెడ్డి సంక్షేమసంఘం అభ్యున్నతికి పాటుపడతానన్నారు. కార్యక్రమంలో బి. రాంచంద్రారెడ్డి, పి. వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

బోడుప్పల్: చిన్నతనం నుంచి విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జేజీఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు అన్నారు. బోడుప్పల్ బృందావన్ కాలనీలోని జే జీఆర్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ బాలల దినోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్తు పదార్థాలకు, ఇంటర్నెట్ మాధ్యమానికి దూరంగా ఉంటానని, తోటి విద్యార్థుల పట్ల స్నేహంగా ఉంటానని ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు సత్ప్రవర్తనతో, సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు కృషి చేయాలని సూచించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డిస్ట్రిక్ గవర్నర్ క్రిష్ణ ప్రసాద్, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 320సీ ముత్యం రీజియన్, రీజియన్ చైర్‌పర్సన్ ముత్యంరెడ్డి ఆధ్వర్యంలో మల్లాపూర్ సూర్యనగర్‌లోని మోడ్రన్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డిస్ట్రిక్ గవర్నర్ లయన్ క్రిష్ణ ప్రసాద్, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బస్తీల్లో మరిన్ని వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్య క్రమంలో డిస్ట్రిక్ గవర్నర్ ఇన్నారెడ్డి, కళ్లెం కృష్ణారెడ్డి,శేఖర్‌రెడ్డి, రాంచందర్ తది తరులు పాల్గొన్నారు.

బాలరత్న అవార్డుల ప్రదానం

రామంతాపూర్ : బాలల దినోత్సవం సందర్భంగా కమలాకర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో రామంతాపూర్ అమ్మ పాఠశాల విద్యార్థినులు జి.హర్షిత సాహిత్యంలో, ఆర్.వర్షిత చిత్ర లేఖనం, సీహెచ్ స్పందన వ్యాస రచనలోనూ ప్రతిభ చూపి బాలరత్న అవార్డుకు ఎంపికయ్యారు. బుధవారం రాష్ట్ర బీసీ కమిషన్, మాజీ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కె.కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు నిత్యాన్నదానం

గౌతంనగర్: గౌతంనగర్ శ్రీసాయి శ్రీనివాస క్యాటరర్స్ అధినేత వై.శ్రీనివాస్‌రావు గురుస్వామి ఆధ్వర్యంలో సరస్వతీ హై స్కూల్ ఎదురుగా బుధవారం అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. డిసెంబర్ 30 వరకు అయ్యప్ప స్వాములకు ప్రసాద వితరణ కొనసాగుతుందని తెలిపారు.


ప్రసాద వితరణకు హాజరైన అయ్యప్ప స్వాములు